రంగంవలసలో ఏనుగుల సంచారం

సీతంపేట : సీతంపేట ఏజెన్సీకి శివారు ప్రాంతమైన రంగంవలస కొండలపైన ఏనుగులు మంగళవారం సంచరించడంతో గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. జొన్నలు, రాగులు, కొండచీపుర్లు, చెరుకు పంటలను నాశనం చేస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే రాత్రి వేళల్లో ఏనుగుల ఘీంకారంతో తమకు కంటిమీద కునుకు లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కొండల్లో సంచరిస్తున్న ఏనుగులు

పాలకొండ శంఖారావ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఇసుక దందా

- భూకబ్జాలూ పెచ్చుమీరాయి
- అధికారంలోకి వస్తే ఏనుగుల సమస్య పరిష్కారం
- జీవో 3 అమలు చేస్తాం
- పూర్ణ పాడు-లాబేసు వంతెన పూర్తి చేస్తాం
- శంఖారావం సభల్లో నారా లోకేష్

ప్రజాశక్తి-పాలకొండ, కురుపాం, గరుగుబిల్లి

వైసిపికి చెందిన పాలకొండ, కురుపాం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఇసుక దందాలకు పాల్పడుతూ ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. టిడిపి అధికారంలోకి వస్తే ఏజెన్సీని ఏళ్లతరబడి పీడిస్తున్న ఏనుగుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గిరిజనులకు ఉపయోగపడే జీవో 3 అమలు చేస్తామని ప్రకటించారు. అవినీతి అధికారులు, వైసిపికి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆగడాలు కట్టిస్తామని అన్నారు. పాలకొండ, కురుపాంలో ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు నిమ్మల జయకృష్ణ, తోయిక జగదీశ్వరి అధ్యక్షతన జరిగిన శంఖారావం సభల్లో నారా లోకేష్ మాట్లాడారు. జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలేవీ అమలు చేయలేదని అన్నారు. సంపూర్ణ మధ్య పాన నిషేధం అంటూ మాట తప్పిన ముఖ్య మంత్రి అని ఎద్దేవా చేశారు. 40ఏళ్లు దాటిన ఎస్‌టిలకు పింఛను ఇస్తానని చెప్పి మోసం చేశారన్నారు. జిల్లాలో సుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తానని చెప్పి మాట తప్పారన్నారు. బాంబులకే జడని కుటుంబం తమదని, జగన్‌పెట్టే కేసులకు భయపడేది లేదని అన్నారు.

టిడిపి అధికారం లోకి వస్తే ఏనుగులు సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. ఎన్నో ఏళ్లగా గిరిజనుల కలగా ఉన్న పూర్ణ పాడు - లాబేసు వంతెన నిర్మాణం పూర్తి చేస్తామని, గుమ్మిడి గెడ్డ ను నిర్మిస్తామని తెలిపారు. పార్టీ కోసం ఎక్కువ కష్టపడి కేసులు భరించిన వారిని గుర్తించి నామిటెడ్ పదవులు అందిస్తామన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ చేయడానికి జగన్ రెడ్డే తెరలేపారని, ఎంతో ఉత్తరాంధ్రకు అవసరమైన ఉక్కుకర్మాగారాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రభుత్వమే దాన్ని తీసుకుని నడిపించి కార్మికులకు అండగా నిలుస్తుందని అన్నారు. ఐటిఐ కళాశాల, పాలిటెక్నికల్ కళాశాల, తోటపల్లి అధునీకరణ పనులు పూర్తి చేస్తామని, లిప్ట ఇరిగేష్ పనులకు నిధులు కేటాయిస్తామని తెలిపారు. జగన్ పాలనలో తొమ్మిది సార్లు కరెంట్ బిల్లులు, మూడు సార్లు ఆర్టీసీ చార్జీలతోపాటు ఇంటి పన్నులు, చెత్త పన్నులు కూడా విపరీతంగా పెంచేశారన్నారు. చివరికి రానున్న రోజుల్లో గాలి పన్ను కూడా విధిస్తారని ఎద్దేవా చేశారు. విశాఖ పట్టణంలోని ప్రజాధనంతో రూ.500 కోట్లు ఖర్చు పెట్టి ప్యాలెస్ నిర్మాణం చేసుకున్నారని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాఅవసరాలకు వినియోగిస్తా మన్నారు. ఇంకా ఎన్నికలకు రెండు నెలలు మాత్రమే సమయం ఉందని, కార్యకర్తలంతా కష్టపడి జనసేన, టిడిపి మద్దతు తెలిపిన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించి జగన్ రెడ్డి గద్దెదించాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు అవినీతిపరులు

ఒకరిని గెలిపిస్తే..పాలకొండ నియోజకవర్గంలో ఇద్దరు ప్రజాప్రతినిధులు వచ్చి ప్రజల మీద పడి దోచుకుంటున్నారని నారా లోకేష్ ఆరోపించారు. ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పట్టణంలోని డిగ్రీ కళాశాల దగ్గర విలువైన స్థలాన్ని కబ్జాకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇసుక దందాలు చేసుకుంటున్నారన్నారు. ఒకరు నాగావళి నది నుంచి ఇసుకను దోచుకోగా, మరొకరు వంశధార నది నుంచి ఇసుక దోపిడీ చేస్తున్నారన్నారు. రెండుసార్లు కళావతిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు ఆమె చేసినదేమీ లేదన్నారు. నియోజకవర్గ సమస్యలను పూర్తిగా గాలికి వదిలేశారన్నారు.కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, ఆమె భర్త పరీక్షిత్‌రాజు, ఆమె బావ రమేష్ అడ్డంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇసుక దోపిడీతోపాటు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను అమ్ముకుంటున్నారని విమర్శించారు.

పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలో సమస్యలను పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. పాలకొండ వెనుకబాటుతనానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలే కారణమన్నారు. నియోజకవర్గంలో భూ కబ్జాలు, ఇసుక మాఫియా వారి కనుసన్నల్లోనే సాగుతుందన్నారు. రెండేసి మండలాలను ఇద్దరు సర్దుకుని దోచుకుంటున్నారని ఆరోపించారు. స్థానిక నగర పంచాయతీలో కోట్లు విలువైన స్థలం ఎమ్మెల్సీ విక్రాంత్ కబ్జాలు చేయగా, ఎమ్మెల్యే కళావతి వండువలో 33 ఎకరాలు చెరువును కబ్జా చేశారన్నారు. గిరిజనులు అవసరమైన జీవో నెంబరు3ను పక్కా అమలు చేయాలని, నియోజకవర్గంలో ఐటీఐ, డిప్లమా కళాశాలు ఏర్పాటు చేయాలని, ఇరిగేషన్ ప్రాజెక్టులకు పూర్తి చేయాలని నారా లోకేష్‌ను కోరారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిమ్మల ఇబ్రం మాట్లాడుతూ వైసిపి పాలనలో పని చేసే వారు తక్కువ అయ్యారని, దోచుకునే వారు ఎక్కువయ్యారని అన్నారు. అరుకు పార్లమెంటరీ ఇన్‌చార్జ్ కిడారి శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ అరాచపాలన జరుగుతుందని, స్కామ్‌లు ప్రభుత్వాన్ని తరిమి కొట్టాలన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన జిల్లా అధ్యక్షులు పి.చంద్రమోహన్, టిడిపి, జనసేన పార్టీల నాయకులు పడాల భూదేవీ, గర్భాన సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్య నాయకులు ఎందుకు రాలేదో?

శంఖారావం సభకు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు, పార్టీ అధ్యక్షులు అచ్చెన్నాయుడు హాజరు కాకపోవడం పట్ల సర్వత్రా చర్చ జరిగింది. తొలి నుంచి పాలకొండ నియోకవర్గంలో ఒక గ్రూపు కళావెంకటరావు, మరో గ్రూపు అచ్చెన్నాయుడుతో ఉండడంతో గ్రూపుల పోరు సెగ వారికి తగలకుండా దూరంగా ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

జెఇఇ మెయిన్స్‌లో ఉత్తరాంధ్ర టాపర్‌గా శ్రీనిధి

ప్రజాశక్తి - కొమరాడ

జెఇఇ మెయిన్స్‌లో ఎన్‌టిఎ ర్యాంకింగ్‌లో ఉత్తరాంధ్రలో ధనుకొండ శ్రీనిధి టాపర్‌గా నిలిచింది. మండలంలోని దళాయిపేటకు ధనుకొండ శ్రీనివాసరావు, సుశీల రెండో కుమార్తె శ్రీనిధి. ఈమె జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో 300మార్కులకు 290స్కోర్ సాధించి 99.99 పర్సంటేజీ సాధించి ఉత్తరాంధ్రలో టాపర్ గానిలిచింది. భౌతిక, రసాయనశాస్త్రాల్లో వందకు వందమార్కులు, గణితంలో వందకు 99.99మార్కులు సాధించి టాప్‌లో నిలిచింది. శ్రీనిధి తల్లిదండ్రులు ఇద్దరూ ఉపాధ్యాయులే. శ్రీనిధి పదో తరగతి వరకు విజయనగరంలో చదవగా, ప్రస్తుతం ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం ఎంపీసీ గ్రూపు విజయవాడలోని శ్రీచైతన్య కాలేజీలో చదువుతుంది. శ్రీనిధికి మంచి ర్యాంకు రావడంపట్ల పలువురు అభినందనలు తెలిపారు.

గిరిజన విద్యార్థులు ప్రతిభ

సీతంపేట : స్థానిక ఐటిడిఎ ఆధ్వర్యంలో ఐఐటి సూపర్ 60కి శ్రీకాకుళం వైటిసిలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు జెఇఇ మెయిన్స్‌లో ప్రతిభ కనబర్చారు. 30 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వగా, వీరిలో 20 మంది విద్యార్థులు జెఇఇ అడ్వాన్స్‌కు అర్హత సాధించారు. అత్యధిక స్కోరు సాధించిన వారిలో కొత్తూరు ఉపేంద్ర 88.98, గేదెల చైతన్య 87.14, ఆరిక ప్రశాంత్ 83.96, సవర స్రవంతి 78.07, బిడ్డిక ఫ్రాన్సిస్ 75.79, సవర అభి 71.50 మార్కులు సాధించారు. సూపర్ 60 ప్రారంభించిన ఐదు నెలల్లోనే అత్యుత్తమ ఫలితాలను సాధించడంపై ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి విద్యార్థులకు, ప్రిన్సిపల్ బెండి మురళీబాబు, ఫ్యాకల్టీ సభ్యులైన బి.కిరణ్ కుమార్, కెవికె శ్రీకాంత్, వైవి వసంత కుమార్ బి.ప్రభాకర్ రావు వైటిసి కేర్‌టేకర్ కె.శ్రీనివాసరావు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎన్.రాంబాబు సిబ్బందికి అభినందనలు తెలిపారు.

విజయనగరం : పట్టణంలోని పాల్‌నగర్‌కు చెందిన నమ్మి కౌశిక్ కల్యాణ్ జెఇఇ మెయిన్స్‌లో 98.97శాతం మార్కులు సాధించాడు. కల్యాణ్ తండ్రి చినబాబు వ్యాపారి కాగా, తల్లి రాజ్యలక్ష్మి టిడిపి నగర మహిళా అధ్యక్షులుగా పని చేస్తున్నారు.

కలెక్టరేట్ నిర్మాణానికి రూ.99.90 కోట్లు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లా కలెక్టర్ కార్యాలయ నిర్మాణానికి రూ.99.90 కోట్లతో మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిఒఆర్‌టి 65 ఉత్తర్వులను ఈ నెల 8న విడుదల చేసింది. సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయాన్ని (ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్) అడ్డాపుశిలలో నిర్మించేందుకు నిధులను మంజూరు చేసింది. రాష్ట్రంలో 13 జిల్లాల్లో సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయాలు నిర్మించాలని ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా రహదారులు, భవనాలు శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ సమర్పించిన సవివరమైన నివేదిక మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త జిల్లాల్లో సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయం నిర్మించాలని, అందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలో మొదటి విడతలో నిర్మాణానికి ప్రతిపాదించి శ్రీకారం చుట్టడం హర్షించదగ్గ పరిణామం.

ఉత్తర్వులు జారీ కావడం సంతోషం

సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం సంతోషంగా ఉందని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. అడ్డాపుశిల వద్ద భూమిని ఎంపిక చేశామని, 59.80 ఎకరాల భూమిని కేటాయించామని చెప్పారు. భవన నిర్మాణ పనులు త్వరగా ప్రారంభమై, వేగవంతంగా పూర్తి కావాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. తదుపరి ప్రక్రియ వేగవంతం కాగలదని ఆయన అన్నారు.

సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ఆర్‌బికె, సచివాలయ భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని పనసభద్ర, చప్పబుచ్చంపేట, సరాయివలస గ్రామాల్లో రైతు భరోసా కేంద్రం, సచివాలయాల భవనాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర మంగళవారం ప్రారంభించారు. గ్రామాలకు చేరుకున్న ఉప ముఖ్యమంత్రిని గ్రామస్తులు సాంప్రదాయ నృత్యాలతో ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ కావడానికి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. రైతుల చెంతకు విత్తనాలు, ఎరువులు అందజేందుకు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. అధునాతన వ్యవసాయం చేసేందుకు డ్రోన్లను అందించేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో 12 మందికి డ్రోన్లు ఉపయోగించడంలో శిక్షణ ఇచ్చామని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో ఇళ్ల రిజిస్ట్రేషన్లను చేయడం జరుగుతోందని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ స్వరాజ్యాన్ని తీసుకువచ్చారని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసనాయుడు, మండల వైసిపి అధ్యక్షులు మావుడి రంగునాయుడు, ఎంపిడిఒ దేవకుమార్, తహశీల్దార్ సింహాచలం, ఇతర ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ ఎవరికో?

లోకేష్ టూర్ తో ఉత్కంఠకు తెర పడుతుందా?
వేయి కళ్లతో ఎదురు చూస్తున్న టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గ టిడిపి అభ్యర్థి విషయంలో ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు భరోసా ఎవరికి లభిస్తుందనే సందిగ్ధత ఇంకా కొనసాగుతూనే ఉంది. పార్టీ నాయకత్వం సర్వేల మీద సర్వేలు చేస్తున్నా అభ్యర్థి ఎంపికపై అధిష్టానం ఏకాభిప్రాయానికి రాకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. నియోజకవర్గ ఇంఛార్జిగా గుమ్మిడి సంధ్యారాణి గడిచిన ఐదేళ్లుగా కొనసాగుతున్నారు. ఇంఛార్జిగా ఆమె ఉన్నప్పటికీ ఆమె అభ్యర్థిత్వం పట్ల నియోజకవర్గ పార్టీలో ఏకాభిప్రాయం లేకపోవడం పార్టీ నాయకత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది. పార్టీలో ఆమెకు మద్దతు తెలియజేస్తున్న వారి కన్నా వ్యతిరేకంగా ఉన్న వారి శాతం ఎక్కువగా ఉండడంతో అధిష్టానం ప్రత్యామ్నాయం వైపు అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగానే మరో గిరిజన నాయకురాలు, రిటైర్డ్ టీచర్ మోజూరు తేజోవతి తెరపైకి వచ్చారు. ఆమెకు బహిరంగంగానే మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్, మక్కువ మండల సీనియర్ నాయకులు పెంట తిరుపతి రావు మద్దతు పలుకుతున్నారు. లోపాయికారీగా మిగిలిన మండలాలకు చెందిన కొంతమంది కీలక నాయకులు కూడా మద్దతు తెలియజేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. నియోజకవర్గ ఇంఛార్జి సంధ్యారాణితో కలిసి పని చేస్తున్నట్లు కనిపిస్తున్న నాయకులు కూడా తెరవెనుక నుంచి తేజోవతికి అండగా వుంటామని భరోసా ఇస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. అధిష్టానం ఎవరికి టికెట్ ఇస్తే వారి గెలుపునకే పని చేస్తామని చెపుతున్న వారు కూడా పార్టీ లో కనిపిస్తున్నారు. పార్టీలో సంధ్యారాణికి మద్దతుగా నిలుస్తున్న ఒక గ్రూపు నాయకులు, తేజోవతికి అండగా నిలిచిన మరో గ్రూపు నాయకులు ఉన్నారు. వీరితో పాటు తటస్థులైన కొంతమంది నాయకులు, కార్యకర్తలు కూడా ఉన్నారు. జీరో నుంచి మొదలైన ఆశావహి తేజోవతి ప్రస్థానం పార్టీలో చాపకింద నీరులా విస్తరిస్తున్న పరిస్థితికి చేరింది. ఆమె కూడా ఉన్నత విద్యావంతురాలు, సామాజిక, రాజకీయ అంశాలపై అవగాహన కలిగిన మహిళా నాయకురాలు కావడంతో పార్టీ నాయకత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోలేని పరిస్థితి ఏర్పడిందనే చర్చ మొదలైంది. బొబ్బిలి నియోజకవర్గ ఇన్చార్జి బేబీనాయన ఆశీస్సులు, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ మద్దతు తేజోవతికి ఉండడం వల్ల ఆమె అభ్యర్థి అయితే గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉందనే ప్రచారం కూడా మరోవైపు జరుగుతోంది. తాజా పరిణామాల నేపథ్యంలో నియోజకవర్గ పార్టీ శ్రేణుల్లో నెలకొన్న ఉత్కంఠకు ఎప్పుడు తెరపడుతుందోనని ఎదురు చూస్తున్నారు. ఈనెల 14న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ బాబు టిడిపి ఎన్నికల శంఖారావం పూరించడానికి పట్టణానికి వస్తున్నారు. ఈ సభ విజయవంతానికి ఎవరికి వారు ప్రయత్నిస్తున్నారు. లోకేష్ పర్యటనతోనైనా అభ్యర్థి విషయంలో స్పష్టత వస్తుందనే నమ్మకంతో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. అయితే పార్టీ అభ్యర్థి ఎంపికలో అధినేత చంద్రబాబు నాయుడుదే తుది నిర్ణయమన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఇంతవరకు నిర్వహించిన పార్టీ సర్వేల్లో తేలిన అంశాలు, స్థానిక సామాజిక, రాజకీయ పరిస్థితులు, అధికారపార్టీ అభ్యర్థి ఎవరనే అంశాలను పరిగణనలోకి తీసుకుని చంద్రబాబు నాయుడే అభ్యర్థులను ప్రకటిస్తారని తెలుస్తోంది. అంతవరకు చంద్రబాబు ష్యూరిటీ ఎవరికనేది సస్పెన్స్‌గానే మిగిలిపోతుంది.

సభకు ఏర్పాట్లు చేస్తున్న కార్యకర్తలు

లోకేష్ సభ విజయవంతానికి ఏర్పాట్లు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఎన్నికల శంఖారావం సభ విజయవంతం చేయడానికి చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. జైపూర్ రోడ్డులో ఆర్‌టిఒ కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలంలో బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గం నలుమూలల నుంచి సుమారు పదివేల మందిని సమీకరణ చేయాలని నిర్ణయించారు .టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్పీ భంజ్ దేవ్ మంగళవారం సాయంత్రం సభ ఏర్పాట్లు పరిశీలించారు.

తనిఖీలు పెంచాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

సాధారణ ఎన్నికల నేపధ్యంలో గంజాయి, మద్యం, డగ్స్, డబ్బు రవాణాను నిరోధించేందుకు తనిఖీలు పెంచాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరు కార్యాలయంలో నార్కో కో-ఆర్డినేషన్ సెంటర్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టరు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు, రవాణా నిరోధించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రవాణా నియంత్రణకు తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని పోలీసు, ఎక్సైజ్, రవాణా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కల్పించాలని కోరారు. ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో మూడు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో గంజాయి, మద్యం, డగ్స్, డబ్బు రవాణాను నిరోధించుటకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గంజాయి రవాణా చేసే వారిపై కఠినమైన సెక్షన్లు అమలవుతాయని, బెయిలు కూడా రాదని అన్నారు. కావున ఎవరూ ఆటువంటి అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనవద్దని తెలిపారు. అంతరాష్ట్ర బస్సు సర్వీసుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అక్రమ సంపాదనకు ఆశపడి కేసుల్లో ఇరుక్కోవద్దని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారిని మాదకద్రవ్యాలు బారినపడకుండా కాపాడుకోవాలని తెలిపారు. సమావేశంలో జెసి ఆర్.గోవిందరావు, డిఎఫ్ఒ జి.ప్రసూన, ఇన్‌ఛార్జి డిఆర్ఒ జి. కేశవనాయుడు, డిఎంహెచ్ఒ బి.జగన్నాథం, జిల్లా ప్రజారవాణా అధికారి టి.వి.ఎస్.సుధాకర్, ఆర్‌టిఒ సి.మల్లిఖార్జున రెడ్డి, బిసి వెల్ఫేర్ అధికారి ఎస్. కృష్ణ, ఎక్సైజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్‌పి విక్రాంత్ పాటిల్

అనుమతి లేకుండా ఇసుక త్రవ్వకాలు జరుపకూడదు

అనుమతులేకుండా ఇసుక తవ్వకాలు జరుపకూడదని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. సుప్రీంకోర్టు గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టు ఆదేశాల మేరకు పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరుపకూడదని తెలిపారు. అనుమతులు పొందిన రీచ్‌ల్లో కూడా పర్యావరణానికి సంబంధించిన అన్ని అనుమతులు పొందాకే ఇసుక తవ్వకాలు జరుపాలని తెలిపారు. జనవరి 4న జిల్లాలో నాలుగురీచ్‌లకు అనుమతులిచ్చామని, వారు రాష్ట్ర స్థాయిలో అన్ని అనుమతులు పొందాకే ఇసుక తవ్వకాలకు అనుమతించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో నదీపరివాహన ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయని వాటిని నిరంతరం పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి గతేడాది 50 కేసులు, ఈ ఏడాది ఇప్పటివరకు 2 కేసులు నమోదు నమోదయ్యాయన్నారు.

గ్రామీణ బంద్ విజయవంతానికి ప్రచారం

ప్రజాశక్తి - కొమరాడ

ఈనెల 16న జరగనున్న గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి. ఇందిర పిలుపునిచ్చారు. బంద్ విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని శివిని, విక్రాంపురం డంగభద్ర, కోనవలస, రాజ్యలక్ష్మీపురం, కొత్తకంభవలస, కందివలస, కుమ్మరిగుంట, స్వామినాయుడు వలస, జంఝావతి, గంగరేగివలస, కోటిపాం, కొమరాడ, గుమడ గ్రామాల్లో మంగళవారం ఆటో ప్రచారం చేపట్టారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల జెఎసి ఉమ్మడిగా పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న గ్రామీణ భారత్ బంద్‌లో కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఉపేంద్ర, కొల్లి సాంబమూర్తి, హెచ్.రామారావు పలువురు రైతు, వ్యవసాయ కార్మిక, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బలిజిపేట: మండలంలోని నారాయణపురం, వెంగాపురం, పెదపెంకి, పెద్దింపేట, మిర్తివలస, తుమరాడలో ఈనెల 16న జరగబోయే దేశవ్యాప్తి గ్రామీణబంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ ప్రచార జాత నిర్వహించారు ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, గేదెల సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతూ, మరోవైపున కార్మిక, రైతు, ఉద్యోగులపై అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ బంద్‌ను చేపడుతున్నట్టు తెలిపారు. కావున మండలంలోని అన్ని వర్గాల ప్రజలు ఈ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వి.శంకరరావు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

పాలకొండ : గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని ఆటో కార్మికులు కరపత్రం ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా ఈనెల 16న గ్రామీణ భారత్‌బంద్‌లో కార్మికులంతా పాల్గొనాలని సిఐటియు పాలకొండ మండల సమన్వయ కమిటీ కన్వీనర్ కాద రాము పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు దూసి దుర్గారావు, చిన్నారావు, అప్పారావు, సూర్యారావు, గోవింద, శ్రీను, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : విక్రాంపురంలో ఆటో ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు

అర్ధాంతరంగా నిలిచిపోయిన ప్రధానరహదారిని చూపుతూ సెల్ఫీ దిగుతున్న లోకేష్

దిక్కుమాలిన పాలనకు నిదర్శనం : లోకేష్

ప్రజాశక్తి - వీరఘట్టం

జగన్ దిక్కు మాలిన పాలనకు నిదర్శనం వీరఘట్టం ప్రధాన రహదారిని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. మంగళవారం కురుపాంలో జరిగే శంఖారావం సభలో పాల్గొనేందుకు వెళుతుండగా వీరఘట్టంలో కంకర పర్చి వదిలేసిన రహదారిని పరిశీలించారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి దివాలా కోరు పాలనకు ప్రత్యక్ష సాక్ష్యం వీరఘట్టం ప్రధాన రహదారి అని అన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టర్లకు రూ.1.80 లక్షల కోట్లు బకాయి ఉండడంతో ఈ ప్రభుత్వం పనులు చేయడం తమ వల్ల కాదని గుత్తేదారులు పరారై పోతున్నారని విమర్శించారు. అధికార పార్టీ నాయకులకు అడ్డగోలు దోపిడీపై తప్ప అభివృద్ధి పనులపై ఆసక్తి లేదని, జగన్ దిక్కుమాలి పాలనకు ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని అన్నారు. ఆయనతో పాటు నియోజకవర్గ బాధ్యులు నిమ్మక జయకృష్ణ ఉన్నారు.

సిహెచ్‌డబ్ల్యులను ఆశాలుగా మార్చాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఎపిఒకు వినతిని అందజేస్తున్న సిఐటియు నాయకులు

కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని, రూ.10వేలు వేతనం పెంచాలని, ఆశా కార్యకర్తలకు అమలవుతున్నట్లు ఇతర సౌకర్యాలన్నీ వర్తింప చేయాలని కోరుతూ ఈనెల 14నుంచి 16 వరకు ఐటిడిఎల వద్ద సామూహిక నిరాహార దీక్షలు చేపడుతున్నట్టు సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు తెలిపారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ విస్తృత స్థాయి సమావేశం యూనియన్ నాయకులు ఎస్.మాలతి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి ఎం.కాంతారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఐటిడిఎల వద్ద జరుగు సామూహిక నిరాహార దీక్షను సీతంపేటలో కూడా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశ అనంతరం ఐటిడిఎ ఎపిఒ రోషి రెడ్డికి వినతి పత్రం సమర్పించారు.

వృద్ధులకు బట్టలు పంపిణీ చేస్తున్న హెచ్‌సి కృష్ణమూర్తి

మానవత్వాన్ని చాటుకుంటున్న హెచ్‌సి

ప్రజాశక్తి - కొమరాడ

పోలీస్ హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూ తనకు వచ్చిన జీతంలోని సగానికిపైగా డబ్బులను పేదల కోసం ఖర్చు చేస్తూ కె.కృష్ణమూర్తి మానవత్వాన్ని చాటుకుంటున్నారు. మంగళవారం కొమరాడ మండలంలోని కునేరు, కొండకునేరు, తుమ్మలవలస, రామభద్రపురం గ్రామాలకు చెందిన హరిజన గిరిజన 45మంది వృద్ధులకు, మహిళలకు రగ్గులు (దుప్పట్లు), స్వీట్లు గ్లాసులు పంపిణీ చేశారు. భారత కోకిల, సంఘ సంస్కర్త భారతదేశానికి మొట్టమొదటి మహిళా గవర్నర్ అయిన సరోజినినాయుడు పుట్టినరోజు సందర్భంగా పార్వతీపురంటౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కృష్ణమూర్తి హెడ్ కానిస్టేబుల్-1273 గ్రామ పెద్దలైన కేలెరెడ్డి భాస్కరరావు, కరకవలస శ్రీనివాసరావు, హెచ్‌జి కె.నారాయణ, రాజు, రామ సమక్షంలో పేద ప్రజలకు సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రతినెలా తన జీతం నుంచి సగానికి పైగా పేద ప్రజల కోసం ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తిని గ్రామస్తులతో పాటు మండలంలోని పలువురు అభినందించారు.

రోగులకు లైఫ్ సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక పెన్షనర్ల సంఘం చొరవతో కురుపాం ట్రెజరీ సిబ్బంది మంగళ వారం గుమ్మలక్ష్మీపురం విచ్చేసి పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్లను వారి ఇంటి వద్దకే వెళ్లి అందించారు. మంచాలపై కదలలేని స్థితిలో ఉన్న దీర్ఘకాలిక రోగులకు, వృద్ధుల ఇళ్లకు వెళ్లి లైఫ్ సర్టిఫికెట్లు సిద్ధం చేసి ఇవ్వడంతో పలువురు వృద్ధులు కృతజ్ఞతలు తెలిపారు. గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట, భద్రగిరి, పి.లేవిడి గ్రామాల్లో గల పలువురు రోగులకు, వృద్ధులకు ఈ సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో ట్రెజరీ అధికారి జగదీష్, సంఘ నాయకులు బాబ్జీప్రసాద్, హరిప్రసాద్, చిన్నారావు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి పంపిణీ

ప్రజాశక్తి-పాలకొండ

మండలంలోని వాటుపాగుకు చెందిన వారాడ సంజీవనాయుడు అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సిఫార్సుతో సిఎం సహాయ నిధి కింద రూ.1.50 లక్షలు చెక్కు వచ్చింది. దీన్ని మంగళవారం జెడ్పీ మాజీ చైర్మన్ పాలవలస రాజశేఖరం, విక్రాంత్ చేతులమీదగా బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో సర్పంచి వావాలపల్లి రాజారావు, పనుకువలస ఎంపిటిసి కోట అజయ్‌కుమార్, వారాడ జగన్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా భూసార పరీక్షలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చురుగ్గా భూసార పరీక్షలు నిర్వహిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎఒ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల నుంచి 60 మట్టి నమూనాలను సేకరించామన్నారు. అలాగే భూసార పరీక్షల ఆవశ్యకత, ప్రయోజనాలను రైతులకు వివరిస్తున్నామని తెలిపారు. జాతీయ ఆహార భద్రతా పథకం ద్వారా పురుగు, కలుపు మందులు రైతులకు కావాలనుకుంటే సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలని చెప్పారు. ఇంకా ఎవరైనా రైతులు పిఎం కిసాన్ ఇకెవైసి చేయించుకోకపోతే త్వరితగతిన చేయించుకోవాలన్నారు. అందుకు గానూ ప్రతి రైతు భరోసా కేంద్రంలోనూ ప్రత్యేక గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అలాగే రైతులు రబీలో వేసిన మొక్కజొన్న పంటకు కొనుగోలు కేంద్రాలు కావాలని కోరారు. సమావేశంలో ఎంపిపి బలగ రమణమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, ఎంపిడిఒ, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

టిడిపి దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

ప్రజాశక్తి-సాలూరు

మండలంలోని పలు గ్రామాల్లో వైసిపి నాయకులు. కార్యకర్తలు టిడిపిలో చేరారంటూ ఆ పార్టీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి దండి శ్రీనివాసరావు,కొట్టు పరువు సర్పంచ్ నర్సింహులు చెప్పారు. మంగళవారం వారు కొట్టుపరువులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొట్టుపరువు పంచాయతీ నుంచి 300 కుటుంబాలకు చెందిన వైసిపి నాయకులు కార్యకర్తలు టిడిపిలో చేరినట్లు ప్రచారం చేసుకుంటున్నారని, అది అవాస్తవమని అన్నారు. ఆ పంచాయతీ లో టిడిపికి ప్రాతినిధ్యం లేదన్నారు. ఆరేళ్ళు ఎమ్మెల్సీ గా వున్న సంధ్యారాణి ఈ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.

కురుపాంలో అభివాదం తెలుపుతున్న టిడిపి నాయకులు

ఎన్టీయార్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న లోకేష్

పాలకొండలో లోకేష్‌కు హారతులిస్తూ స్వాగతం పలుకుతున్న మహిళలు

టిడిపి శంఖారావం దృశ్యమాలిక

లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయకృష్ణ, నాయకులు

లోకేష్‌కు శఖారావం చిత్రపటాన్ని అందజేస్తున్న పడాల భూదేవి

పాలకొండలో ప్రజలతో కరచాలన చేస్తున్న లోకేష్

అలకబూనిన గ్రూపులను ఏకం చేసేనా?

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

నువ్వాదరిని ....నేనీదరిని... అన్న చందంగా ఉంది నియోజకవర్గంలో టిడిపి పరిస్థితి. నాయకుల మధ్య అనైక్యత పార్టీ కార్యకర్తలను, ప్రజలను అయోమయానికి గురి చేస్తోంది. నియోజకవర్గంలో టిడిపి ఆదరణ ఉన్నా, నాయకుల మధ్య అనైక్యత రానున్న ఎన్నికల్లో అభ్యర్థి విజయానికి ఆటంకాలుగా మారనున్నాయని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. కొత్తగా నియోజకవర్గ బాధ్యతలు స్వీకరించిన విజయచంద్ర సీనియర్ నాయకులను, కార్యకర్తలను కలుపుకోపోలేకపోతున్నారన్న అపోహ ప్రజల్లో ఉంది. విభేదాలను పక్కనపెట్టి క్షేత్రస్థాయిలో మాజీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కలిసికట్టుగా పనిచేయకపోవడంతో నియోజకవర్గంలోని బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం అర్బన్, రూరల్‌లో ఉన్న టిడిపి కార్యకర్తలు, అభిమానులు సానుభూతిపరులు సందిగ్ధ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు ధీటుగా పనిచేసేందుకు విభేదాలను మరచి నాయకులంతా ఒక్కటిగా నిలవాలనే సూత్రాన్ని ప్రాతిపదికగా తీసుకోగలిగినట్లయితే 2014లో టిడిపి విజయం ఖాయమని కార్యకర్తలు ఘంటాపదంగా చెబుతున్నాయి. ఈ పరిస్థితులపై బుధవారం పార్వతీపురంలో జరగనున్న శంఖారావం సభకు విచ్చేయనున్న టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ నాయకుల మధ్య ఐక్యత కల్పించినట్లయితే నియోజకవర్గంలో పసుపు జెండా ఎగరడం ఖాయమని పార్టీ అభిమానులు చెబుతున్నారు. అయితే నారా లోకేష్ ఎడమొహం, పెడమొహంగా ఉన్న నాయకులను ఏ మేరకు కలుపుతారోనని తెలుగుదేశం అభిమానులు కార్యకర్తలు, ఎదురుచూస్తున్నారు.

శంఖారావం సభకు భారీ ఎత్తున పాల్గొనాలి : టిడిపి

సీతాగరం : పార్వతీపురంలో బుధవారం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో జరగనున్న శంఖారావం సభకు పెద్ద ఎత్తున టిడిపి శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని మండల టిడిపి నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం స్థానిక సాలహరి ఇంటి వద్ద సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు శంఖారావం సభకు కార్యకర్తలను, అభిమానులను తరలించేందుకు ఏర్పాట్లపై చర్చించారు.

నేడు లోకేష్ శంఖారావం

సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా పార్వతీపురంలోని వెంకంపేట పంచాయతీలో బుధవారం నిర్వహించబోయే శంఖారావం కార్యక్రమానికి విస్తృత ఏర్పాటు జరుగుతున్నాయి. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే బహిరంగ సభలో నారా లోకేష్ ప్రసంగించనున్నారు. ఆయనతో పాటు టిడిపి, జనసేన నియోజకవర్గ నాయకులు, అరుకు పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాట్లాడనున్నారు. సభా ఏర్పాట్లను నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర, మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ బి.చిరంజీవులు, ద్వారపురెడ్డి జగదీష్ పరిశీలించారు.

పెద్దఎత్తున టిడిపి, జనసేన శ్రేణులను తరలి వచ్చేలా దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మండల అధ్యక్షులు పెంట సత్యం నాయుడు, సాలహరి గోపాల్, రౌతు వేణుగోపాల నాయుడు, రెడ్డి సింహాచలంనాయుడు, బొమ్మినాయిని లక్ష్మణ, బుడితి శ్రీను, సబ్బాన శ్రీను, సోమిరెడ్డి రమేష్, గొట్టాపు అప్పారావు, తేరేజమ్మ, గరికయ్య, వాకాడ పారినాయుడు, పోల తిరుపతిరావు, తెంటు రామారావు, బలగ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అడవిలో నిప్పు ..పర్యావరణానికి ముప్పు

ప్రజాశక్తి - సీతంపేట

అడవిలో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు నివారణా చర్యలు చేపట్టాలని ఫారెస్ట్ బీట్ అధికారి దాలి నాయుడు అన్నారు. సీతంపేట ఏజెన్సీలో అటవీశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పెద్ద పొల్ల, తాడిపాయి, గాడిదపాయి, జయపురం, నాయకమ్మ గూడా తదితర గ్రామాల్లో మంగళవారం అడవిలో నిప్పు... పర్యావరణానికి ముప్పు.. అడివి సంరక్షణ సమస్త జీవకోటి పరిరక్షణ అన్న నినాదంతో అవగాహన కల్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి అవగాహన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అడవి ప్రాంతాల్లో నేలపై ఆకులు ఎండినా, తుప్పలు వాటి అంతట అవే కుళ్లి నేలపై సారముల ఏర్పడతాయని వాటిని, కాల్చి బూడిద చేయరాదని చెప్పారు. అటవీ ప్రాంతాల్లో కాల్చిన సిగరెట్, బీడీలు, మంటలకు సహకరించే వస్తువులు పడే రాదని చెప్పారు. తేనె, చీపుర్లు మొదలగు అటవీ ఉత్పత్తులు సేకరించేటప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని చెప్పారు.

కొమరాడ : కొండపోడు రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో సంభవిస్తున్న అగ్ని ప్రమాదాల నియంత్రణపై గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నట్టు అటవీశాఖ కొమరాడ ఫారెస్టర్ ఎస్.గౌరీశంకరరాజు స్పష్టం చేశారు. మంగళవారం కొమరాడ సెక్షన్ పరిధిలో గల వివిధ గిరిజన గ్రామాల్లో అగ్ని ప్రమాదాలపై అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ గౌరీశంకర్‌రాజు మాట్లాడుతూ కొండచీపుర్లు, జీడిసాగు చేస్తున్న ప్రాంతాల్లో ఫలసాయం అయిపోయిన తర్వాత అగ్గిపెట్టడం గిరిజనులకు ఆనవాయితీగా వస్తోందన్నారు. మంటల కారణంగా కొండల్లో ఉండాల్సిన జంతువులు మైదాన ప్రాంతాలకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటి వరకు వంద గ్రామాల్లో గిరిజనులకు అవగాహన కల్పించామన్నారు. ముఖ్యంగా పోడు వ్యవసాయం చేసే సమయంలో గిరిజన రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ అగ్గి మంటలు పెట్టరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అటవీశాఖ గార్డులు సత్యనారాయణ, లక్ష్మణరావు, రాజు, గోపిక ఉన్నారు.

గిరిజన గ్రామాల్లో అటవీ శాఖ అవగాహన

సీతంపేటలో అవగాన ర్యాలీ నిర్వహిస్తున్న అటవీవాఖాధికారి దాలినాయుడు

ముందస్తుగా ఎసిఎం స్ప్రేయింగ్

ప్రజాశక్తి - కురుపాం

విద్యార్థులు జ్వరాల బారినపడకుండా ముందుస్తు చర్యల్లో భాగంగా విద్యా సంస్థల్లో ఆల్ఫా సైపర్ మెత్రీన్ (ఎసిఎం 5) స్ప్రేయింగ్ చేస్తున్నట్టు జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు తెలిపారు. దోమల వ్యాప్తి నివారణకు స్థానిక కెజిబివి హాస్టల్‌లో నిర్వహించిన స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పర్యవేక్షించారు. హాస్టల్ లోపల గోడలు, సెల్ఫ్‌లు, సీలింగ్ ఇతరత్రా ఇరుకు ప్రదేశాల్లో దోమల మందు పిచికారీ చేసే తీరును పరిశీలించారు. అనంతరం జగన్మోహనరావు మాట్లాడుతూ వసతి గృహాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా, విద్యార్థులు జ్వరాలు బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా దోమల నివారణ మందును పిచికారీ చేయించామని తెలిపారు. దీన్ని వల్ల ఆయా ప్రదేశాల్లో దోమలు స్థావరాలు ఏర్పర్చుకోలేవని, ఈ మందు ప్రభావం దాదాపుగా రెండు నెలల వరకు ఉంటుందన్నారు. విద్యార్థులకు వైద్య సిబ్బంది చేపట్టిన రక్త పరీక్షల నమూనాలను పరిశీలించారు. అనంతరం అక్కడ విద్యార్థులతో మాట్లాడి ఎవరికైనా ఆరోగ్యపరమైన సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ తదితర జ్వర లక్షణాలు, పరిశుభ్రత, రక్తహీనత మొదలగు అంశాలపై ఆరోగ్య అవగాహన కల్పించారు. అవసరమైన మందులు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి ఎస్.నారాయణరావు, కెజిబివి ప్రత్యేక అధికారి ఐ.కిరణ్ కుమారి, వైద్య సిబ్బంది మురళీకృష్ణ, నిర్మల, ప్రత్యూష, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

తాబేలువలస, లక్ష్మీనగర్‌లో బోర్లు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మొండెంఖల్ పంచాయతీలో గల తాబేలువలస, లక్ష్మీనగర్‌లో పంచాయతీ నిధులతో కొత్తగా బోర్లు నిర్మాణ పనులకు సర్పంచ్ ఐ.గౌరీశంకర్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకొని ముందస్తు జాగ్రత్తగా పంచాయతీలో తాగునీటి ఎద్దడి లేకుండా చేయడమే లక్ష్యంగా అన్ని గ్రామాల్లో పంచాయతీ నిధుల నుంచి ప్రజలకు నీరందించేందుకు గానూ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అందులో భాగంగా ఈ రెండు గ్రామాల్లో బోరు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ఈ మేరకు సర్పంచ్‌కు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

బీమా చెక్కులు అందజేత

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని దబ్బగెడ్డ పంచాయతీ పరిధిలో దబ్బగెడ్డ, విజయరాంపురం గ్రామాలకు చెందిన సీదరపు ఇరుపమ్మ, ఇప్పాకుల రాము అనారోగ్యం కారణంగా ఇటీవలే మృతి చెందారు. వీరు గతంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులో పిఎంజెజెబివై, పిఎంఎస్‌బివైలో బీమా పాలసీలు చేయించారు. ఈ నేపథ్యంలో ఇరుపమ్మ, రాము ఖాతాదారుల నామినీలైన ఇప్పాకుల రవి, సీదరపు రౌతు ఒక్కొక్కరికి రూ.2లక్షలు చొప్పున బీమా చెక్కులు మంగళవారం అందించినట్టు స్థానిక ఎపిజివిబి మేనేజర్ బాబు తెలిపారు. కార్యక్రమంలో విఒఎ మర్రి ఆదందొర, బ్యాంకు మిత్ర మల్యాడ రామారావు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొండవాడలో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కొండవాడ సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండవాడ చుట్టుపక్కలకు సంబంధించిన గిరిజన ప్రజలు హాజరై జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య సలహాలను, సూచనలను తీసుకున్నారు. అలాగే ఈ శిబిరంలో తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఎం.బుద్దేశ్వరరావుతో పాటు పలువురు వైద్యులు గిరిజన ప్రజలకు సేవలను అందించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.జగదీష్ కుమార్, పలువురు అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్లు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఇటీవల పార్వతీపురం బదిలీపై వచ్చి విధుల్లో చేరిన ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ సంతోష్, స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ పద్మావతి కొత్తగా విధుల్లో చేరిన అనంతరం మంగళవారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావును ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాటు సారా, గుట్కా వంటి వాటిని నియోజకవర్గంలో ప్రవేశించకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

ఎంఎల్ఎపై ఆరోపణలు తగదు

ప్రజాశక్తి -భామిని

పాలకొండలో నిర్వహించిన టిడిపి శంఖరావం కార్యక్రమంలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తన స్థాయిని మరిచి స్థానిక ఎమ్మెల్యే వి.కళావతిపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం అన్నారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే తన కర్తవ్యమని భావించే ఎమ్మెల్యే కళావతిపై ఇసుక దందా చేస్తున్నరని తప్పుడు ఆరోపణలు చేయడం దారుణమన్నారు. గతంలో కళావతికి రూ.20కోట్లు ఇచ్చి, గిరిజన మంత్రి పదవి ఇస్తానని ఆశ చూపినా, తనకు రాజకీయ భవిష్యత్తు ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డిని విడిచి రాలేనని, తనను నమ్ముకుని గెలిపించిన పాలకొండ నియోజకవర్గ ప్రజలే సంక్షేమ తన కర్తవ్యం అని చెప్పిన కళావతిపై తప్పుడు ఆరోపణలు చేయడం టిడిపి దిగజారుడు తనానికి స్పష్టం అవుతుందిదని అన్నారు. రానున్న ఎన్నికల్లో కళావతి గెలుపుతో టిడిపికి సరైన సమాధానం చెబుతామన్నారు. విలేకరుల సమావేశంలో వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, జెడ్‌పిటిసి బొడ్డేపల్లి ప్రసాదరావు, జెసిఎస్ కో ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, పిఎసిఎస్ చైర్మన్ గెల్లంకి రమేష్, వైసిపి సీనియర్ నాయకులు కొత్తకోట ఆంజనేయులు, కాగితపల్లి కృష్ణ, మెడిబోయిన జగదీశ్వరావు, సర్పంచులు కె.పాల్గుణరావు, పాపి నాయుడు, కొత్తూరు ప్రసాద్ రావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు అప్పారావు

రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని జిల్లేడువలస, గాదెల వలస గిరిజనుల మధ్య గొడవలు సృష్టించిన తహశీల్దార్ బాలమురళీకృష్ణ, విఆర్వో కష్ణమూర్తి లపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు, మండల కార్యదర్శి వంతల సుందరరావు డిమాండ్ చేశారు. మంగళవారం వారు స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లేడువలస, బొర్ర పణుకువలస గ్రామాల గిరిజనులు సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో అన్ని గ్రామాలతో పాటు గిరిజనుల భూములను సర్వే చేశారని, పట్టాలు ఇస్తామని నమ్మించి మోసగించారని విమర్శించారు. ఇటీవల తహశీల్దార్ బాలమురళీకృష్ణ గాదెలవలస గిరిజనులకు మాత్రమే పట్టాలిచ్చి, జిల్లేడువలస, బొర్ర పణుకువలస గిరిజనులకు ఇవ్వలేదన్నారు. విఆర్ఒ కృష్ణమూర్తి అధికారులను తప్పుతోవ పట్టించారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే గిరిజనుల సాగుభూములకు పట్టాలివ్వాలని, లేనిచో రిలే నిరాహారదీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కూనేటి చినబాబు వున్నారు.

టెన్త్ విద్యార్థులు సత్తా చాటాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లాలో వెనుకబడిన తరగతుల (బిసి) సంక్షేమ శాఖ వసతి గృహాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు రానున్న పబ్లిక్ పరీక్షల్లో సత్తా చాటాలని జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి ఎస్.కృష్ణ అన్నారు. జిల్లాలో బిసి సంక్షేమ శాఖ వసతి గృహాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై మంగళవారం స్థానిక ప్రభుత్వ బ్రాంచ్ ఉన్నత పాఠశాలలో పునశ్చరణ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ బిసి సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఇప్పటికే వసతి గృహాల్లో పత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గణిత, భౌతిక శాస్త్రాలు, ఆంగ్లంలో మెళకువలు, తర్ఫీదు అవసరమని, సంబంధిత అంశాల్లో శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో పార్వతీపురం ఎబిసిడబ్ల్యుఒ ఎస్.సాంబమూర్తి, పలువురు వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని ఏ గ్రామంలోనూ వేసవిలో నీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపిపి మజ్జి శోభారాణి కోరారు. మంగళవారం ఎంపిపి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. డి-సిర్లాం పైలట్ పథకంలో తలెత్తిన సాంకేతిక సమస్యలను తొలగించి తక్షణమే తాగునీరు సరఫరా పునరుద్ధరించాలని ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ పవన్‌కుమార్‌ను కోరారు. అలాగే నిరంతరం విద్యుత్తు సరఫరా జరిగేందుకు చర్యలు చేపట్టాలని విద్యుత్ జెఇని కోరారు. అనంతరం ఎంఇఒ పాఠశాలల ప్రగతిని వివరించగా, పెద్ద బొండపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అనూష వైద్య శాఖ చర్యలను వివరించారు. అనంతరం వివిధ శాఖలకు చెందిన అధికారుల పనితీరును ఎంపిపి ఎంపిడిఒ అఖిబ్ జావేద్‌తో కలిసి సమీక్షించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, ఎఎంసి చైర్మన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపిపిలు బంకురు రవికుమార్, సిద్ధ జగన్నాధరావు, పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

105మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి - సీతానగరం

అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీపురం గ్రామానికి చెందిన గోవిందరావు అక్రమంగా 105మద్యం బాటిళ్లను తరలిస్తుండగా సిబ్బంది పట్టుకున్నారు. పట్టుబడ్డ గోవిందను స్టేషన్కు తరలించి కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.